అభివృద్ధి పనుల పరిశీలన

కాచిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించడంతో ప్రజాధనం వృథా అవుతోందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నాడని ఆరోపించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మంగళవారం సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. కాచిగూడ డివిజన్ పరిధిలో నింబోలిఅడ్డ లాల్ బహదూర్ హైస్కూల్ నుంచి చెప్పల్‌బజార్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తగా నిర్మించిన రోడ్లపై నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లేదంటే స్థానిక ప్రజలతో కలిసి జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, ఆర్.సంతోష్, వాసు, భీమ్‌రాజ్, బాలప్రసాద్, సూరి, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.


నింబోలిఅడ్డలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజ

ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజలో ఉన్నారని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ భవనంలో ఐవీఎఫ్ ఇంటర్నేషనల్ అడ్వైజరీ కమిటీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా వైశ్యులందరినీ ఏకతాటిపైకి తేవడంతో పాటు ఐవీఎఫ్ అభ్యున్నతికి విశేష సేవలు అందిస్తున్నందుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. గంజి రాజమౌళి గుప్తా క్రమశిక్షణ, సేవకు మారుపేరు అని ప్రశంసించారు. పేద వైశ్యుల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన సేవా సంస్థగా ఐవీఎఫ్ కొనసాగుతుందన్నారు. గంజి రాజమౌళి గుప్తా మాట్లాడుతూ..నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసే వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. నిస్వార్థంగా పని చేసే వారికి మంచి పేరు, ప్రఖ్యాతి, ఉన్నత పదువులు వరిస్తాయన్నారు. ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వైశ్య విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ మహిళా విభాగం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజశేఖర్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రాజమౌళి గుప్తాను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏ.సీతయ్య అన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని నాగార్జున స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ పోటీ పరీక్షల విద్యార్థుకు కొత్త చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ.. యువత సైబర్ నేరాలకు గురవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయివంటి మత్తు పదార్థాలకు బానిసలుగా కాంకుడా వాటి నివారణకు తోడ్పడాలని కోరారు. కొత్త చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతగల పౌరులుగా ఉండాలని సూచించారు. లా చట్టాలు నేరాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధాలు, సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎకనామీ నిపుణులు నాగార్జున, గ్రూప్స్, పోటీ పరీక్షల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అంబేడ్కర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ అన్నారు. మంగళవారం అంబేడ్కర్ కళాశాలలో జూనియర్ కళాశాలల ఓరియంటేషన్ ప్రొగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ.. అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనేక మంది పేద విద్యార్థుల చదువులకు వేదికగా తమ విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సి.భారతీ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, కళాశాల జాయింట్ సెక్రటరీ రమణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: ప్రభుత్వ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గోల్నాకలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేసి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ భవనం విద్యార్థులకు అనువుగా ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. భవనంలో విద్యార్థులకు కావాల్సిన వసతులు కలిపించి సామర్థ్యానికి తగిన విద్యార్థులు చేరేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం, అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ప్రవీణ్‌కుమార్, వార్డెన్ కిరణ్, రాములు తదితరులున్నారు.

మున్నూరుకాపు మహాసభను అనుబంధ సంస్థగా గుర్తింపు


కొండ దేవయ్యకు లేఖను అందజేస్తున్న ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు

కాచిగూడ: పిల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షుడిగా ఉన్న రాష్ట్ర మున్నూరుకాపు మహాసభను కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డుకు అనుబంధ సంస్థగా గుర్తించినట్లు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తెలిపారు. కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఈ సందర్భంగా దేవయ్య, ఆర్‌వీ.మహేందర్‌కుమార్ మాట్లాడుతూ.. సంఘ ప్రతినిధులతో ఇటీవల ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ను కలిసి రెండు మహాసభలు ఉండటంతో ట్రస్ట్‌బోర్డు గుర్తించిన మహాసభ ఏదని తెలుపాలని కోరుతూ లేఖను అందజేశామన్నారు. దీంతో పిల్లి శ్రీనివాస్ అధ్యక్షుడిగా ఉన్న మున్నూరుకాపు మహాసభను ట్రస్ట్‌బోర్డు గుర్తించిందని, 2014లో ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను కూడా ఆయన ఆధ్వర్యంలోని మహాసభ నేతృత్వంలో నిర్వహిస్తామని వివరించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి


కార్పొరేటర్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు గాంధీనగర్ కార్పొరేటర్ పావనికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లోని సాయికృపా అపార్ట్‌మెంట్ వీధిలో తరచూ డ్రైనేజీ లీకై మురుగునీరు రోడ్లపై పారుతుందన్నారు. దీంతో రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తానని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ విజయ్‌కుమార్, నేతలు హర్షయాదవ్, నరేందర్, సంపతంయాదవ్, స్థానికులు అరుణ, విజయలక్ష్మి, మనోహర్, రామకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, జై చందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నియామకం

చిక్కడపల్లి: నవభారత్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం ఆమె అశోక్‌నగర్‌లో మాట్లాడుతూ.. ఇటీవల ఓ హోటల్‌లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో తనను ఎన్నికున్నారన్నారు. నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమాలతో పాటు తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బి.వాణి, కోశాధికారి గీత, 320ఎ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ డి.కోటేశ్వరరావు, జోనల్ చైర్మన్ గోపాలకృష్ణ, వినయ, డాక్టర్ స్వారూపారాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్ష పదవి బీసీకి ఇవ్వాలి


గుజ్జ సత్యం

కాచిగూడ: ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే టీపీసీసీ అధ్యక్ష పదవి కాంగ్రెస్ పార్టీలో అర్హులైన బీసీ వ్యక్తికి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. మంగళవారం కాచిగూడలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం పదవులకు అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవుల్లో బీసీలు లేరని, టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలని ఆయన కోరారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో కూడా బీసీలకు పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, నందగోపాల్, పండరినాథ్, బీసీ కోర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: బ్యూటీషియన్‌లో 3 నెలల డిప్లొమా కోర్సుకు ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అంజలి బ్యూటీ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కె.అంజలిరెడ్డి తెలిపారు. బ్రైడల్ మేకప్, పార్టీ మేకప్, గన్‌షాట్, ఫేషియల్, హెయిర్‌కట్, హెయిర్ స్టైల్, హెయిర్ స్పా, హెయిర్ డై, హెయిర్ ఫాలింగ్ ట్రీట్‌మెంట్, హెన్నా ట్రీట్‌మెంట్ తదితర అంశాలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 7330709900.

దళిత బాలుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళిత బాలుడిని తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆశన్నగారి మధుసూధన్‌రెడ్డి, అతడి భార్య కమలమ్మ, కుమారుడు జగన్మోహన్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారం గ్రామంలో దళిత బాలుడు బేగరి యాదగిరి (12) దానిమ్మ కాయలను తెంపాడనే కారణంతో మధుసూధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసుపై నిర్లక్ష్యం చేస్తున్న పోలీసులపైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఘటన జరిగిన గ్రామాన్ని సందర్శించి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై జూన్ 22న డయల్ 100కు ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి దాడి చేసిన వారికి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కేవీపీఎస్ ఉపాధ్యక్షులు ఎం.ప్రకాష్ కరత్, నర్సింగ్‌రావు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, గొల్లపల్లి దయానంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు

ఐపీఎం ఉద్యోగుల సమస్యలపై సమీక్ష

కాచిగూడ: ఐపీఎం ఉద్యోగుల సమస్యలపై టీఎన్జీవో నేతలు ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీలతో సమావేశమై చర్చించారు. ఐపీఎంలోని కొన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌కు అటాచ్ చేస్తూ.. ఇక నుంచి అక్కడ పనిచేయాలని డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చూస్తామని డైరెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ సెంటర్ ప్రభుత్వంలో భాగమేనని, ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌కు నోడల్ ఆఫీసర్లుగా ఐపీఎం అధికారులే ఉంటారని డాక్టర్ శివలీల చెప్పారు. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్, అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, టీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలూరి శ్రీనివాస్‌రావు, ప్రధానకార్యదర్శి సత్యనారాయణలు మంగళవారం నారాయణగూడలోని ఐపీఎంలో డైరెక్టర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఐపిఎం ఉద్యోగులకు అండగా ఉంటామని, ఉద్యోగుల సమస్యలను అవసరమైతే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సంఘం నేతలు

కవాడిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంకను కలిసి విజ్ఞప్తి చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రియాంకను మంగళవారం తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు గడప శ్రీహరి, సంఘం ఉపాధ్యక్షుడు గూడబోయిన శివరత్నం, నేతలు భగవాన్, మల్లేష్, తెలంగాణ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు ఎ.ఎల్ అంబటి సుధాకర్ మల్లయ్య కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మత్స్యకార సొసైటీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి గడప శంకర్, సత్యనారాయణ, అంబటి మల్లయ్య, సుధాకర్, మహిళా అధ్యక్షురాలు ఆర్.స్వర్ణలత, ఉపాధ్యక్షులు భారతి, పద్మ, సంగీత, సునిత సబ్జిమండి, వారాసిగూడ, సీతాఫల్‌మండి, కుమ్మరిగూడ మత్స్యకార సొసైటీ నేతలు పాల్గొన్నారు.

గ్రూప్-2, 3 ఉద్యోగాలను పెంచాలి


ధర్నా చేస్తున్న సునీల్ తదితరులు

చిక్కడపల్లి: గ్రూప్-2, 3 ఉద్యోగాలను పెంచాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అశోక్‌నగర్ చౌరస్తాలో నిరుద్యోగులకు మద్దతుగా ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. జీఓ నంబర్ 46ను పరిష్కరించాలని కోరారు. మెగా డీఎస్సీలో పోస్టులను పెంచాలని గ్రూప్ 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నవీన్‌బాబు, సాయిమహేష్, అనిల్‌కుమార్, అనికేత్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి


విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఈ నెల 6, 7న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురాం కోరారు. ఈ మేరకు విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర కమిటీ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కౌన్సిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నామన్నారు. అదే విధంగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం విద్యను కాషాయ కరణ చేసి మూఢ నమ్మకాలను పెంచి పోషించే నూతన జాతీయ విద్యా విధానాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ కౌన్సిల్‌కు ముందు బహిరంగ సభ ఉంటుందన్నారు. ఇందులో ప్రొఫెసర్ హరగోపాల్, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


తన అమ్మతో మొక్కను నాటిస్తున్న రాజు

ముషీరాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు పిలుపునిచ్చారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన 'అమ్మ పేరిట ఒక మొక్క'అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం జెమినీ కాలనీలో పూస రాజు తన తల్లి సత్తమ్మ చేత మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూస రాజు మాట్లాడుతూ..కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ వర్షాకాలంలో ఒక మొక్క నాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్, నరేష్, రవి, మహేందర్‌బాబు, బద్రీనారాయణ, నాఆయకులు పార్థసారథి, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్, బొమ్మిడి వీరస్వామి, బుజ్జి, వెంకటేశ్వర్లు, జమాల్పూర్ నందు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

జానపద సాహిత్యమే భాషా సంపదకు మూలం

చిక్కడపల్లి: జానపద సాహిత్యమే భాషా సంపదకు మూలం అని ఇనాక్ స్పష్టం చేశారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ అన్నారు. పరిశోధకులకు ఇనాక్ రచనలు మార్గ నిర్దేశం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా అభ్యుదయ రచయితల సంఘం రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఇనాక్ పరిశోధన సాహిత్యంపై సోదాహరణ ప్రసంగం చేశారు. ఇనాక్ రచించిన తెలుగు వ్యాస పరిణామం సమగ్రమైన సాహితీ పరిశోధన అన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్ ధన్యవాదాలు తెలిపారు. పాలకవర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు.

